క్లుప్తంగా

వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



వాణిశ్రీ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్‌లను వారి నివాసంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధులు శాలువా, పూలదండతో సత్కరించారు. హస్నాబాద్ సర్పంచ్ పకీరప్ప, దౌల్తాబాద్ ఎంపీపీ విజయ కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, బీసీ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్ పాల్గొన్నారు.

మందుల పంపిణీ



మందులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కొడంగల్: అంగడిరాయిచూర్ గ్రామంలో చర్మ వ్యాధులు ఉన్న ఇద్దరు చిన్నారులకు అమ్మానాన్న ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చర్మ వ్యాధులు తగ్గే వరకు ప్రతి నెలా ఔషధాలు అందజేస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. తల్లిదండ్రులు లేని చిన్నారులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సంస్థను స్థాపించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, అనిల్, వెంకట్‌రాములు, నరేష్‌రాజ్, అరవింద్, చంద్ పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి సన్నిధిలో భక్తుల సందడి



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

యాలాల: సంగెంకుర్దు సంగమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. సమీపంలోని కాగ్రవేణి త్రివేణి సంగమంలో భక్తజనం స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేశారు. సంగమేశ్వరుడితో పాటు ఇటీవల కొత్తగా నిర్మించిన శనేశ్వరాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నాగప్ప!

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడిగా గౌతపూర్ గ్రామానికి చెందిన జెన్నె నాగప్పను నియమించనున్నట్లు సమాచారం. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తాండూరు ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ ఆదేశాల మేరకు మండలాల నూతన అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ధారాసింగ్, నర్సింహులు తెలిపారు. తాండూరు మండల అధ్యక్షుడిగా నాగప్ప, పట్టణ అధ్యక్షుడిగా హబీబ్‌లాల, యాలాల అధ్యక్షుడిగా నర్సిరెడ్డి, పెద్దేముల్ అధ్యక్షుడిగా గోపాల్, బషీరాబాద్ మండల అధ్యక్షుడిగా నర్సింహులు గౌడ్‌ను నియమించనున్నారని, త్వరలో రమేష్ మహరాజ్ అధికారికంగా ప్రకటిస్తారని పేర్కొన్నారు.



యాలాల: మిషన్‌భగీరథ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ



మోమిన్‌పేటలో..

దూప తీర్చిన మిషన్ భగీరథ

- తెలంగాణలో తొలగిన తాగునీటి కష్టాలు
- తాగితే భగీరథ నీటినే తాగాలి
- మంచినీళ్ల పండుగలో వక్తలు

'మిషన్ భగీరథ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటికి నిత్యం కటకట ఉండేది. వేసవి వచ్చిందంటే పల్లెలు, పట్టణాల్లో నీటి యుద్ధాలే జరిగేవి. తెలంగాణ సిద్ధించాక రాష్ట్ర ప్రజల దప్పిక తీరింది' అని వక్తలు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరూరా మంచినీళ్ల పండుగ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'మిషన్ భగీరథ' పథకం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని కొనియాడారు.

యాలాల: మిషన్ భగీరథ పథకంతో రాష్ట్రంలో తాగునీటి కష్టాలు తీరాయని ముద్దాయిపేట సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన నీళ్లపండుగలో మిషన్ భగీరథ విజయంపై అవగాహన కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి ఉండేదన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో భగీరథ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి.. ప్రజల దాహం తీర్చారని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు సబియాబేగం, పద్మ, వార్డు సభ్యులు రవికుమార్, జయమ్మ, రాజప్ప, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుందని సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో నిర్వహించిన నీళ్ల పండుగలో సర్పంచ్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి తంటాలు ఉండేవని, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని చెప్పారు.



కొడంగల్: రుద్రారంలో

కొడంగల్‌లో..

కొడంగల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నీళ్ల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు సరఫరా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో దశాబ్ది ఉత్సవాల ప్రత్యేక అధికారి కృష్ణన్, ఎంపీడీఓ పాండు, మిషన్ భగీరథ డీఈఈ శశాంక్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంపీపీ హేమీబాయి, జెడ్పీటీసీ మహిపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో మంచి నీళ్ల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాఘవపూర్‌లోని ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. భగీరథ నీటిని శుభ్ర పరుస్తున్న తీరును పరిశీలించారు.



దోమలో..

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: పరిగి మండలం జాఫర్ పల్లి మిషన్ భగీరథ పంప్ హౌజ్ వద్ద మంచినీళ్ల పండుగ ఘనంగా జరిగింది. ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మ, మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీరేష్‌లు.. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు భగీరథ నీటిపై అవగాహన కల్పించారు.

గృహిణులకు తప్పిన తిప్పలు

దోమ: మిషన్ భగీరథతో గృహిణులకు నీటి కష్టాలు తప్పాయని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన మంచినీళ్ల పండుగలో సర్పంచ్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీటికి అనేక ఇబ్బందులు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం వచ్చాక నీటి కష్టాలు తొలగిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో తాగునీటి సహాయక ఇంజినీర్ ఖాజ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు అంజిలయ్య, రమేశ్, లావణ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరే తాగాలి

బషీరాబాద్: తాగితే మిషన్ భగీరథ నీటినే తాగాలని ఎంపీపీ కరుణ అన్నారు. మంచినీటి పండుగలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం భగీరథతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తుందని, గతంలో వేసవి వచ్చిందంటే తాగునీటి కటకట ఉండేదని, ఇప్పుడు ఆ బాధ పోయిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ కొడంగల్ దగ్గర ఉన్న భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ మాన్‌లతో సందర్శించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని సర్పంచ్ సౌమ్యారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరిగిన మంచినీళ్ల పండుగలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ నల్ల కనెక్షన్ ఇచ్చి.. మిషన్ భగీరథతో ప్రజల దాహం తీరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: దామర్‌చెడ్‌లో..



కుల్కచర్లలో..

దరఖాస్తు గడువు పెంచాలి

పరిగి: కుల వృత్తులకు ఆర్థిక సహాయం ప్రకటించిన ప్రభుత్వం.. పథకం దరఖాస్తు గడువును పెంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూన్ 6 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకోవాలని ప్రభుత్వం చెప్పిందన్నారు. దీంతో కుల వృత్తుల వారికి ధ్రువపత్రాలు అందక.. ఇబ్బంది పడుతున్నారని, కావున ప్రభుత్వం అప్లికేషన్ గడువును పెంచాలని కోరారు.

ముదిరాజ్ సంఘం సమావేశం నేడు

పెద్దేముల్: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మండల సమావేశం నిర్వహిస్తామని సంఘం మండల అధ్యక్షుడు వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 2గంటలకు సంఘం స్థానిక కార్యాలయంలో జరిగే సమీక్షకు మండల పరిధి 26 గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలో జరిగే బహిరంగసభ, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై చర్చిస్తామని, సకాలంలో ముదిరాజ్‌లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అది పొలాలకు వెళ్లే పానాది..

తాండూరు రూరల్: గోనూర్‌లో భూ వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాళీ స్థలం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇదే విషయమై స్పందించిన తహసీల్దార్ చిన్నప్పల నాయుడు.. ఆ భూమి పొలాలకు వెళ్లే పానాది అని, అక్కడ ఎటువంటి పనులు చేపట్టవద్దని హెచ్చరించారు. అనంతరం కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పనులు ఆగిపోయాయి. సోమవారం పెన్సింగ్ వేసిన స్థలానికి వెళ్లి పూర్తి విచారణ జరుపుతామని తహసీల్దార్ తెలిపారు.


అభివృద్ధిలో వెనుకబాటు

అనంతగిరి: పాలకుల నిర్లక్ష్య ధోరణి వలన జిల్లా అభివృద్ధికి నోచుకోవడం లేదని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి పెద్ది అంజయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ సాధన పోరాటంలో ముందున్న వికారాబాద్ జిల్లా.. అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందనే విషయం ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒకప్పుడు విద్యలో ప్రథమస్థానంలో ఉన్న జిల్లా.. ఇప్పుడు చివరి స్థానానికి చేరుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి మరోసారి ఉద్యమించడానికి సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

అధికారం కోసమే అధికార పార్టీలోకి..

మోమిన్‌పేట: స్వార్థ ప్రయోజనాల కోసమే బీజేపీని వీడటమే కాకుండా.. నిందిస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి.. నియోజకవర్గ మాజీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డిపై మండిపడ్డారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పార్టీకి, పదవికి రాజీనామా చేసిన మధుసూదన్‌రెడ్డి.. తిరిగి బీఆర్ఎస్‌లో చేరడంపై ఆయన ఆదివారం స్పందించారు. ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పించినప్పటికీ.. స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీని వీడి, నిందించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. ఏ పార్టీలో ఇముడలేని వ్యక్తి తిరిగి.. అధికార పార్టీలోకి వెళ్లడం అధికారం కోసమేనని ఎద్దేవా చేశారు. ఉన్న పార్టీలన్నింటిని ఆయన వడపోశారని ఆరోపించారు. బీజేపీకి మధుసూదన్ చేసిందేమీ లేదని, కానీ పార్టీ మాత్రం ఆయనకు నియోజకవర్గ కన్వీనర్‌గా బాధ్యతను అప్పగించి మేలు చేసిందని పేర్కొన్నారు. ఇంత చేసిన పార్టీపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఆయన పార్టీని వీడటం వలన నష్టమేమీ లేదని చెప్పారు.

నాణ్యతకు తిలోదకాలు!



పగుళ్లు ఏర్పడిన సీసీరోడ్డు

దోమ: ఒక సారి సీసీరోడ్డు నిర్మాణం చేపడితే అక్కడి నేల స్వభావాన్ని బట్టి ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం కనీసం పదేళ్లయినా మన్నికగా ఉండాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల వైఫల్యం వలన సీసీ నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటకే పరిమితం అవుతున్నాయి. వేసిన సీసీ కేవలం ఒక్క రోజులోనే పగుళ్లు ఏర్పడి గ్రామస్తులందరి దృష్టిని మళ్లించింది. దోమ మండలం బొంపల్లిలో జెడ్పీ నిధుల నుంచి ఓ కాంట్రాక్టర్ శుక్రవారం సీసీ నిర్మాణం చేపట్టారు. నిర్మాణంలో నాణ్యత లోపించి కేవలం ఒక్క రోజులోనే పగుళ్లు ఏర్పడిందని సర్పంచ్ సురేశ్, గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామస్తులు సీసీ రోడ్డును పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిగా సీసీ నిర్మాణాలు చేపడుతున్నారని, విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సర్పంచ్ తెలిపారు.

పెట్టుబడి సాయం కోసం..



రైతుబంధుకు దరఖాస్తు చేసుకుంటున్న రైతు

- కొత్తవారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో రైతుబంధు నగదు జమ
- కౌలురైతుకు అందని సాయం

దౌల్తాబాద్: ఈ వానాకాలం(ఖరీఫ్) సాగు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 2018–19 నుంచి ఏటా రెండు సార్లు పెట్టుబడిగా ఎకరాకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం సాయం పంపణీ చేస్తోంది. ఈ సాయంతో రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోలు చేస్తున్నారు. వానాకాలం సాగు ప్రణాళికను ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. మండలంలో వేల ఎకరాల్లో పత్తి, కంది, పెసర, వరి, జొన్న తదితర పంటల సాగు అంచనా వేశారు. ఇందుకు ఎరువులు, విత్తనాల అవసరాన్ని గుర్తించారు. ప్రస్తుతం కొత్తగా పట్టాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత శాఖ అధికారులు అర్హులైన అన్నదాతల నుంచి అప్లికేషన్లు తీసుకుంటున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెవెన్యూ శాఖలో భూ సమస్యలు పరిష్కరిస్తూ పట్టాపాసు పుస్తకాలను జారీ చేయడం నిరంతర ప్రక్రియ. ప్రతి పంట సీజన్‌లో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు రైతుబంధు మంజూరు చేస్తున్నారు. వానాకాలం సీజన్ సాగుకోసం రైతుబంధుకు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మండలంలో 640మంది రైతులు పట్టాలు పొందినట్లు వ్యవసాయ శాఖ రైతు బంధు పోర్టల్‌లో వివరాలు పొందుపరిచారు. దీంతో వీరంతా సంబంధిత ఏఈఓలను సంప్రదించి సాయం కోసం అర్జీలు పెట్టుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అర్హులైన రైతులు బ్యాంకుఖాతా, ఆధార్, పట్టాపాసు పుస్తకం జిరాక్స్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

కౌలురైతులను ఆదుకోవాలి

రైతుబంధు పథకాన్ని సాగు భూమి ఉన్న వారికి మాత్రమే అందజేస్తున్నారు. కౌలురైతులకు ఈ పథకం వర్తించడం లేదు. పట్టాదారులకు రైతుబంధు నగదు వచ్చినా.. కౌలురైతులకు కౌలు ధరలు తగ్గించడం లేదని కౌలురైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూమిని సాగు చేస్తున్న కౌలురైతులకు సైతం రైతుబంధు వర్తింపజేసి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

> **దరఖాస్తు చేసుకోవాలి**
>
> 
>
> కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులకు ఈ వానాకాలం సీజన్ నుంచి రైతుబంధు సాయం అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. కొత్తవారు ఏఈఓలకు అర్జీ పెట్టుకోవాలి. ఎలాంటి సందేహాలున్నా ఏఈఓ, వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి.
>
> – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

రైతు వేదికలు ఇక అందరివి!



రైతు వేదికలు ఇక ప్రజా వేదికలుగా మారనున్నాయి. రైతులకు సంబంధించిన సమావేశాలే కాకుండా.. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మీటింగులు పెట్టుకునే వీలు కల్పిస్తూ ఇటీవల వ్యవసాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులకు ప్రభుత్వం అంతర్గత ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఇక నుంచి అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల కోసం ఈ వేదికల్లో సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చు.

- వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయం
- వ్యవసాయశాఖ అధికారులకు అంతర్గత ఉత్తర్వుల జారీ

దోమ/ కొడంగల్ రూరల్: రైతు వేదికలను ఇకపై అన్ని ప్రభుత్వ శాఖలు వాడుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. ఈ మేరకు వ్యవసాయ అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయి. వ్యవసాయ శాఖలో సమకాలీన సాగు అంశాలపై రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ప్రతి వ్యవసాయ క్లస్టర్‌కు ఓ రైతు వేదికను నిర్మించి ఏఈఓలతో రైతులకు సమావేశాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వానకాలం, యాసంగి సీజన్లలో మూడు, నాలుగు నెలలకు ఒకసారి ఏఈఓలు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తారు. మిగతా రోజులు అవి ఖాళీగానే ఉంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవలే కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రైతు వేదికలు ఖాళీగా ఉండకుండా ప్రభుత్వ పరిధిలో ఉన్న అన్ని శాఖల వారు క్లస్టర్ల స్థాయిలో సమావేశాలకు ఉపయోగించుకోవచ్చునని పేర్కొంది. దీంతో ఇక మీదట రైతు వేదికలు అందరి వేదికలుగా మారనున్నాయి!

99 వేదికలు

వికారాబాద్ జిల్లాలో మొత్తం 99 రైతు వేదికలు ఉన్నాయి. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షలు వెచ్చించింది. 250 మంది రైతులు కూర్చునే విధంగా తీర్చిదిద్దింది. అదే విధంగా మైకులు, కుర్చీలు, నీటి వసతి, టాయిలెట్ల సౌకర్యం, కరెంటు సౌకర్యం కల్పించింది. వేదిక నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.9 వేలు అధికారులకు చెల్లిస్తుంది.

ప్రస్తుతం సాగు సమావేశాలే..

రైతు వేదికల్లో ప్రస్తుతం వ్యవసాయ శాఖకు సంబంధించిన సమావేశాలే నిర్వహిస్తున్నారు. ఏటా భూసార పరీక్షలకు సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేసి, రైతులకు సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే భూసార పరీక్ష సామగ్రి వచ్చినా.. వాటికి అవసరమయ్యే రసాయనాలు ప్రభుత్వం సరఫరా చేయలేదు. దీంతో భూసార పరీక్ష కిట్లు నిరుపయోగంగా మారాయి.

> **ఎలాంటి ఆదేశాలు రాలేదు**
>
> 
>
> రైతు వేదికల్లో కేవలం వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ శాఖకు సంబంధించిన అనుబంధ శాఖలు మాత్రమే సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. ఇతర శాఖలు నిర్వహించుకోవాలని తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇస్తాం. తదనంతరం సమీక్షలు జరుపుకోవచ్చు.
>
> – గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

సాగు సమస్యల పరిష్కార వేదికలు..

సాగులో సమస్యలు వస్తే రైతులు వ్యవసాయ అధికారులను కలవాలంటే మండల, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారిపై సమయం, ఆర్థికభారం పడేది. వ్యవసాయ అధికారులు సాగులో అధునాతన పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలంటే గతంలో వేదిక దొరకడమే కష్టంగా ఉండేది. వీటన్నింటిని గమనించిన ప్రభుత్వం రైతువేదికలను నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. వేదిక కేంద్రంగా సంబంధిత శాఖ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ పంటల సాగుపై అవగాహన కల్పించి.. సాగు సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

కుల్కచర్ల: అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు నర్సింహులు కుటుంబాన్ని తాము అన్ని విధాలుగా ఆదుకుంటామని 2007 బ్యాచ్‌కి చెందిన డైట్ విద్యార్థులు వీరప్ప, బాలకృష్ణ, మల్లేశ్, వెంకటేశ్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం మృతుడి కుటుంబాన్ని వారు పరామర్శించి, రూ.22 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సన్మానిస్తున్న యువకులు

తాండూరు రూరల్: ఐఎస్‌ఓ(ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్) గుర్తింపు పొందిన కరన్‌కోట్ గ్రామ పంచాయతీకి అభినందనలు వెల్లువెత్తాయి. కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్ వీణ, ఉప సర్పంచ్ హేమంత్‌కుమార్‌లను గ్రామ యువకులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గ్రామస్తుల సహకారంతోనే అవార్డు వచ్చిందని తెలిపారు.

ఏకాంబరిలో 'అమావాస్య' జాతర

రామలింగేశ్వరుడి సన్నిధిలో భక్తజనం

బషీరాబాద్: ఏకాంబరి రామలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆదివారం అమావాస్యన జరిగే జాతరకు మండలం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. కొలనులో స్నానం ఆచరించి, స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమావాస్య రోజున రామలింగేశ్వరున్ని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని, దుష్ట శక్తులు పారిపోతాయని భక్తుల విశ్వాసం. జాతర సందర్భంగా భారీగా దుకాణాలు వెలిశాయి. ఇదిలా ఉండగా.. యేటా శ్రావణమాసం చివరి సోమవారం ఇక్కడ పెద్ద జాతర జరుగుతుంది.



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

నేడు హరితోత్సవం

కొడంగల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్కులో ఉదయం 9గంటలకు జరిగే కార్యక్రమానికి కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. 10 గంటలకు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ట్యాంక్‌బండ్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతారని వెల్లడించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పెద్దేముల్ మండలం నాగులపల్లిలో ఉదయం 9 గంటలకు హరితోత్సవం నిర్వహించనున్నామని ఎంపీడీఓ లక్ష్మప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవంలో తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బంట్వారంలో

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో హరితోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు బాలయ్య, లక్ష్మీనారాయణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు నర్సరీలను సందర్శించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటాలని ప్రకటించారు. అడవుల పునరుద్ధరణ కోసం తీసుకుంటున్న చర్యలను ఫారెస్ట్ అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

దోమలో..

దోమ: హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏపీఓ దస్తయ్య ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని, అనంతరం ఊటుపల్లి జీపీలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. వేడుకకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి హాజరుకానున్నారని వెల్లడించారు.